ఆపన్నులకు అండగా..

- ప్రాణాపాయ స్థితిలో ఉన్న చిన్నారి వైద్యానికి వాసుపల్లి భరోసా
- బాలుడి చికిత్సకు సాయం చేస్తానని తల్లిదండ్రులకు హామీ


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాలుడు పవన్‌కుమార్


వాసుపల్లిని వేడుకుంటున్న బాలుడు పవన్‌కుమార్ తల్లిదండ్రులు, బంధువులు

డాబాగార్డెన్స్ : పదేళ్ల పాటు ఎమ్మెల్యేగా కొనసాగారు. నిత్యం ప్రజల్లోనే ఉన్నారు. నియోజకవర్గ ప్రజలకు ఏ సమస్య వచ్చినా.. మీ సమస్యకు పరిష్కారం నాదంటూ ప్రజల పక్షానే నిలిచారు. ప్రజా సమస్యల పరిష్కారంతో పాటు నియోజకవర్గ పరిధిలో వైద్య పరంగా ఎవరికి బాగులేక పోయినా ఆశ్రయించిన వారందరికీ ప్రతి నెలా వైద్య ఖర్చులు.. మందుల ఖర్చుల కోసం తన సొంత నిధుల నుంచి ఆర్థిక సాయం అందించారు. వారంలో మంగళ, శుక్రవారాల్లో నియోజకవర్గ పరిధి పలు ప్రాంతాల్లో ప్రజాదర్బార్‌లు నిర్వహించి అక్కడికక్కడే అధికారులతో మాట్లాడి సమస్యలు పరిష్కరించేవారు. గత సార్వత్రిక ఎన్నికల్లో ఓటమి పాలైనప్పటికీ నియోజకవర్గ ప్రజలు.. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు సేవలందిస్తూనే ఉన్నారు. అతనే విశాఖ దక్షిణ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త వాసుపల్లి గణేష్‌కుమార్. ఎన్నికల ముందే కాదు.. ఎన్నికల తర్వాత.. ఓటమి అనంతరం కూడా తన సేవలు కొనసాగిస్తూ ఔరా అనిపించుకుంటున్నారు. ఇప్పటి వరకు ఎంతో మంది వాసుపల్లి సేవలు పొందిన వారిలో ఉన్నారు.

చిన్నారిని బతికించుకుందాం..

బ్లడ్‌క్లాట్ (రక్తం గడ్డకట్టడం)తో ప్రాణాపాయ స్థితిలో ఉన్న ఐదేళ్ల పవన్‌కుమార్‌ను బతికించుకోవాలని ఆ బాలుడి తల్లిదండ్రులు మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్‌ను శనివారం ఆశ్రయించారు. ఆశీల్‌మెట్ట అశోక్‌నగర్‌లో గల వాసుపల్లి కార్యాలయంలో ఆ బాలుడి తల్లిదండ్రులు కారి గరగయ్య, ధనలక్ష్మితో పాటు పలువురు బంధువులు సాయం అందివ్వాలని వేడుకున్నారు. దీనికి వాసుపల్లి స్పందిస్తూ.. బాబుని బతికించుకునేందుకు తన వంతు సాయం అందిస్తానని హామీ ఇచ్చారు. బాబు బ్రెయిన్‌కి ఇన్ఫెక్ట్ అయి బ్లడ్‌క్లాట్ కావడంతో అత్యవసరంగా సర్జరీ చేయాలని, అందుకు సుమారు రూ.10 లక్షల వరకు ఖర్చవుతుందని ఇండస్ ఆస్పత్రి వైద్యులు పేర్కొన్నారు. కూలి పనులు చేసుకునే తమకి అంత ఆర్థిక స్థోమత లేదని, ఎంతో మంది పేదలకు ప్రాణదానం చేసిన మీరు.. ఈ బాబుకి సాయం చేస్తారని మీ వద్దకు వచ్చామని బాబు తల్లిదండ్రులు వాసుపల్లికి చెప్పగా.. బాబుకి అవసరమైన చికిత్స అందించేందుకు తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని వాసుపల్లి వారికి భరోసా ఇచ్చారు.

కనకమహాలక్ష్మికి సహస్ర తులసీదళార్చన


తులసీదళార్చనలో సిరులతల్లి

డాబాగార్డెన్స్ : బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి దేవస్థానంలో శనివారం సహస్ర తులసీదళార్చన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో, అమ్మవారి త్రికాల పంచామృతాభిషేక సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. సహస్ర తులసీదళార్చనలో పాల్గొన దలిచే భక్తులు రూ.1,500, త్రికాల పంచామృతాభిషేక సేవలో పాల్గొనే భక్తులు రూ.1,000 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చని ఆలయ ఈవో పి. శ్రీనివాసులరెడ్డి తెలిపారు. ప్రత్యేక పూజను పరోక్ష పద్ధతిలో చేసుకునే భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్త రోడ్డు శాఖ, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్‌ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081లో చెల్లించవచ్చు. కార్యక్రమంలో ఏఈవోలు వెంపలి రాంబాబు, కె. తిరుమలేశ్వరరావు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

వారాహి మాతకు విశేష పూజలు


విశేష అలంకరణలో రాజశ్యామలాదేవి, అనఘాలక్ష్మీదేవి, వారాహి అమ్మవారు


అమ్మవారికి కుంకుమ పూజలు చేస్తున్న భక్తులు

అల్లిపురం : స్థానిక శ్రీ షిర్డీసాయి దర్బార్‌లో వెలసిన శ్రీ వారాహి అమ్మవారి నవరాత్రులు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఎనిమిదవ రోజు కార్యక్రమంలో భాగంగా శనివారం వారాహి అమ్మవారిని విశేషంగా అలంకరించారు. దీంట్లో భాగంగా మహిళలు అమ్మవారికి కుంకుమ పూజలు చేశారు. వారాహి స్తోత్రంతో అమ్మవారిని కీర్తించారు. ఒకరికొకరు తాంబూలాలు ఇచ్చి పుచ్చుకున్నారు. అమ్మవారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

క్లుప్తంగా

వైభవంగా హనుమాన్ చాలీసా పారాయణ


హనుమాన్ చాలీసా పారాయణం చేస్తున్న భక్తులు

డాబాగార్డెన్స్ : విశ్వశాంతిని కాంక్షిస్తూ వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ వీ 201ఏ ఆధ్వర్యంలో శనివారం గురజాడ కళాక్షేత్రంలో హనుమాన్ చాలీసా పారాయణం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డిస్ట్రిక్ట్ గవర్నర్ గుప్త మాట్లాడుతూ వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం ఇటువంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు క్రమం తప్పకుండా నిర్వహించడం అభినందనీయమన్నారు. దీనిలో భాగంగా హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో సుమారు మూడు వేల మంది భక్తులు పాల్గొని పారాయణ చేశారు. అనంతరం అన్న ప్రసాద వితరణ చేపట్టారు.

ఉచిత ప్రసాదం పంపిణీ


ప్రసాదం పంపిణీ చేస్తున్న ఆర్యవైశ్య యువజన సంఘం సభ్యులు

డాబాగార్డెన్స్ : జగన్నాథస్వామి రథయాత్ర ఉత్సవాల్లో ఆర్యవైశ్య యువజన సంఘం ఆధ్వర్యంలో శనివారం పెద్ద ఎత్తున ఉచిత ప్రసాదం (పులిహోర) భక్తులకు అందజేశారు. కార్యక్రమాన్ని ఎంకే అసోసియేట్స్‌కు చెందిన ప్రముఖ న్యాయవాదులు ఎంకే శ్రీనివాస్, ఎంకే వెంకటేష్, ఆలయ ఈవో టి. రాజగోపాల్ రెడ్డి ప్రారంభించారు. అనంతరం సంఘం అధ్యక్షుడు నల్లూరి నూకరాజు, కార్యదర్శి పూసర్ల సురేష్‌కుమార్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం నిర్వహించే ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో భాగంగా భక్తులకు ప్రసాదం పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో చైర్‌పర్సన్ తీగల రాజేష్, నాలం శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే వంశీకి సత్కారం


ఎమ్మెల్యే వంశీని సత్కరిస్తున్న శ్రీ వెంకట గౌరీ శంకర గ్రంథాలయం ప్రతినిధులు

అల్లిపురం : జీవీఎంసీ 33వ వార్డు వెంకటేశ్వర మెట్ట, శ్రీ వెంకట గౌరీ శంకర గ్రంథాలయం ఆధ్వర్యంలో దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్‌ను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వంశీ మాట్లాడుతూ వెంకటేశ్వరమెట్ట వాసుల ప్రధాన సమస్య అయిన 1450 సర్వే నంబర్ సమస్యను పరిష్కరిస్తామన్నారు. త్వరలోనే వార్డులో పర్యటించనున్నట్లు తెలిపారు. మీలో ఒక్కడిగా తనపై చూపిన ప్రేమాభిమానాలు మరువలేనన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ భీశెట్టి వసంతలక్ష్మి, భీశెట్టి గోపీకృష్ణ, గ్రంథాలయ ప్రతినిధులు కోరిబిల్లి శ్యామ్, సన్యాసిరాజు, నరిసింగరావు, సూర్యనారాయణ, ఆకుల రాజు రాపేటి బాబాజీ తదితరులు పాల్గొన్నారు.

నేడు జిల్లా స్థాయి రోల్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీలు

మురళీనగర్ : విశాఖ రోల్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మురళీనగర్ వైశాఖి స్పోర్ట్స్ పార్కులో నాల్గవ జిల్లా స్థాయి రోల్‌బాల్ పోటీలు ఆదివారం ఉదయం 7 గంటలకు ప్రారంభమవుతాయని వైశాఖి స్పోర్ట్స్ పార్కు అధ్యక్షుడు సనపల వరప్రసాద్ తెలిపారు. ఈ పోటీలకు నగర పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చిని ముఖ్య అతిథిగా ఆహ్వానించామని చెప్పారు. విశాఖ రోల్ బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి తోట లలితప్రియ పర్యవేక్షణలో ఈ పోటీలు నాలుగు విభాగాల్లో నిర్వహిస్తామన్నారు. అండర్-11, 14, 17, 17 ఏళ్లు దాటిన వారికి నాలుగు విభాగాల్లో నిర్వహిస్తామన్నారు. మరిన్ని వివరాలకు 9505950425 నంబరులో సంప్రదించాలని సూచించారు.

వామనావతారంలో జగన్నాథుడు


క్యూలైన్‌లో బారులు తీరిన భక్తులు


వామనావతారంలో బలభద్ర, సుభద్ర సమేత జగన్నాథస్వామి

డాబాగార్డెన్స్ : టర్నర్ చౌల్ట్రీలో జగన్నాథస్వామి వామనావతారంలో శనివారం దర్శనమిచ్చారు. నగరం నుంచే కాక ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలి వచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. క్యూలైన్లు బారులు తీరాయి. ఉదయం 5 నుంచి 6 గంటల వరకు స్వామికి మేలుకొలుపు, నాదస్వరం, 6 నుంచి 7 గంటల వరకూ నిత్యపూజ, 7 నుంచి 9.30 గంటల వరకూ జగన్నాథస్వామి ప్రార్థనా సంఘంచే ప్రార్థనా తరంగిణి, 9.30 నుంచి 10.30 వరకూ సామూహిక లలితా సహస్రనామ పారాయణ. మధ్యాహ్నం 3.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సామూహిక భగవద్గీత, విష్ణు సహస్రనామ పారాయణ నిర్వహించారు. సాయంత్రం వివిధ ఆధ్యాత్మిక కార్యక్రమాలు చేపట్టారు. జగన్నాథస్వామి దేవస్థానం ఫెస్టివల్ ఆఫీసర్, దేవదాయ శాఖ సహాయ కమిషనర్ కె. శిరీష, ఈవో టి. రాజగోపాల్‌రెడ్డి నేతృత్వంలో నిర్వహిస్తున్న జగన్నాథస్వామి రథయాత్ర ఉత్సవంలో పలువురు ప్రముఖులు స్వామిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఎంబర్‌మన్నార్ స్వామి, కోదండరామస్వామి ఆలయాల ఈవో నీలిమ, కరకచెట్టు పోలమాంబ దేవస్థానం ఈవో కె. గాయత్రి, ఎరుకుమాంబ ఆలయ ఈవో రమాబాయి, ఆలయ అర్చకులు పాణంగిపల్లి జగన్నాథాచార్యులు, పాణంగిపల్లి రంగనాథాచార్యులు, పాణంగిపల్లి కేశవాచార్యులు, యేడిద సురేష్‌బాబు పలువురు తదితరులు పాల్గొన్నారు. మధ్యాహ్నం అన్నసమారాధన జరిపారు.

నేడు పరశురామావతారంలో..

జగన్నాథస్వామి రథయాత్ర ఉత్సవాల్లో భాగంగా బలభద్ర, సుభద్ర సమేత జగన్నాథస్వామి ఆదివారం పరశురామావతారంలో భక్తులకు దర్శనమివ్వనున్నారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో పలు ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్టు ఆలయ ఈవో రాజగోపాల్‌రెడ్డి తెలిపారు.

పోటెత్తిన భక్తులు..

వీకెండ్ కావడంతో జగన్నాథస్వామిని దర్శించుకునేందుకు వేలాదిగా భక్తులు తరలివచ్చారు. ఉచిత దర్శనంతో పాటు రూ.20, రూ.50, రూ.200 క్యూలైన్లలో భక్తులు పెద్ద ఎత్తున బారులు తీరారు. ఉచిత దర్శనం క్యూలైన్లు మెయిన్ రోడ్డు వరకు వచ్చాయి. దీంతో కొంత మేర ట్రాఫిక్‌కు ఇబ్బంది ఏర్పడింది. భక్తులు స్వామిని దర్శించుకున్న అనంతరం మెయిన్‌రోడ్డుపై వేచి ఉన్న స్వామి రథం వద్ద ప్రత్యేక పూజలు చేశారు. భక్తుల రద్దీ ఎక్కువగా ఉండడంతో ట్రాఫిక్ పోలీసులు పరిసర ప్రాంతాల్లో వాహనాలు నిలిపేందుకు అవకాశం కల్పించలేదు.

21న గురుపౌర్ణమి వేడుకలు


గురుపౌర్ణమి వేడుకల కరపత్రికను ఆవిష్కరిస్తున్న ధ్యాన మందిరం కమిటీ సభ్యులు

తాటిచెట్లపాలెం: రైల్వే న్యూకాలనీ ఎగ్జిబిషన్ గ్రౌండ్ ఎదురుగా గల షిర్డీసాయిబాబా ధ్యాన మందిరంలో ఈ నెల 21న గురుపౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించనున్నట్లు ధ్యాన మందిర వ్యవస్థాపక అధ్యక్షుడు నూకల శేషగిరిరావు, త్రిపురాన రాంబాబు తెలిపారు. ధ్యాన మందిరంలో శనివారం వేడుకల కరపత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శేషు మాట్లాడుతూ 21వ తేదీ ఉదయం నుంచి అభిషేకాలు, సూర్యోదయం నుంచి సూర్యాస్తమయం వరకు అర్ధ ఏకాహం జరుగుతాయన్నారు. మధ్యాహ్నం మహా అన్నప్రసాదం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో వీ డెంటల్ హాస్పిటల్ డైరెక్టర్ కె.ఎం.కె.రమేష్, ఆడిటర్స్ కె.నారాయణ, భుకారి మహ్మద్, ధ్యాన మందిర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.


వివరాలు వెల్లడిస్తున్న ప్రధాన అర్చకుడు, షిర్డీసాయి సేవా సంఘం ప్రతినిధులు

20 నుంచి బాబా ఉత్సవాలు

అక్కయ్యపాలెం పాలబూత్ సెంటర్‌లోని షిర్డీ సాయిబాబా ఆలయం వద్ద షిర్డీసాయి సంక్షేమ సేవా సంఘం ఆధ్వర్యంలో గురుపౌర్ణమి వేడుకలు నిర్వహిస్తున్నట్లు కమిటీ అధ్యక్షుడు లక్ష్మీ సత్యనారాయణ ప్రసాద్, ప్రధాన అర్చకుడు హరి గోపాలశర్మ తెలిపారు. ఆలయ ఆవరణలో శనివారం మీడియా సమావేశంలో వీరు మాట్లాడారు. ఈ నెల 20న బాబా పల్లకీ సేవతో ఉత్సవాలు ప్రారంభమవుతాయని, 21వ తేదీ ఉదయం నుంచి అభిషేకాలు, ప్రత్యేక సుదర్శన హోమం, అన్నాభిషేకం నిర్వహిస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సెక్రటరీ రేవతీరావు, ట్రెజరర్ పరమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రూ.10 భోజనానికి 356 రోజులు



రూ.10 భోజనం పంపిణీ చేస్తున్న వాల్తేర్ రాయల్ రౌండ్ టేబుల్ సంస్థ సభ్యులు

డాబాగార్డెన్స్ : వాల్తేర్ రాయల్ రౌండ్ టేబుల్ సంస్థ ప్రభుత్వ విక్టోరియా ఆస్పత్రిలో దూర ప్రాంతాల నుంచి వచ్చిన పేషెంట్ సహాయకులకు రూ.10కే రుచికరమైన, శుభ్రమైన భోజనాన్ని స్వామి వివేకానంద సంస్థ ద్వారా ప్రతి రోజూ పంపిణీ చేస్తోంది. ఈ కార్యక్రమం శనివారం నాటికి 356 రోజులకు చేరుకుంది. ఈ సందర్భంగా ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల రౌండ్ టేబుల్ సంస్థ చైర్మన్ మక్సూద్ అహ్మద్ మాట్లాడుతూ దూర ప్రాంతాల నుంచి వచ్చిన పేషెంట్ల సహాయకులకు భోజనం చాలా అవసరమని, రౌండ్ టేబుల్ సంస్థ సభ్యుల సహకారంతో రూ.10కే భోజనాలు అందిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమం భవిష్యత్‌లో కూడా కొనసాగిస్తామని తెలిపారు. అన్నదాన కార్యక్రమాలు, పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న రౌండ్ టేబుల్ సంస్థకు స్వామి వివేకానంద సంస్థ ఈ సందర్భంగా అభినందనలు తెలిపింది. కార్యక్రమంలో రౌండ్ టేబుల్ సంస్థ సభ్యులు కల్యాణ్ ఆదిత్య, భరత్ కొల్లపూడి, స్వామి వివేకానంద సంస్థ అధ్యక్షుడు సూరాడ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

పేద మహిళకు సరకులు అందజేత

ఆరిలోవ : జీవీఎంసీ పదో వార్డు పరిధి రవీంద్రనగర్‌లోని సేవా స్ఫూర్తి సంస్థ ఓ పేద మహిళకు చేయూత అందించింది. ముడసర్లోవ ప్రాంతం రాధాకృష్ణనగర్‌లో పండా నాగమణి అనే మహిళ కొన్నాళ్లుగా అనారోగ్యంతో బాధపడుతోంది. పేదరికం కారణంగా ఇల్లు గడవడం కష్టంగా మారడంతో సేవా స్ఫూర్తి సంస్థ ప్రతినిధులు శనివారం ఆమె నివాసానికి వెళ్లి బియ్యం, పప్పులు, నూనె, నెలకు సరిపడగా నిత్యావసర సరకులు అందజేశారు. ప్రతీ నెలా ఆమె కుటుంబానికి నిత్యావసర సరకులు అందజేస్తామని సంస్థ వ్యవస్థాపకుడు ఒమ్మి అప్పలరాజు తెలిపారు. గత నెలలో బి.ఎస్.ఆర్.నగర్‌లో అనారోగ్యంతో బాధపడుతున్న ఓ పేద మహిళకు నిత్యావసర సరకులు అందజేసినట్లు ఆయన తెలిపారు. సంస్థ సభ్యులు ప్రకాష్, పద్మాజీ, నందు, నానాజీ, గోవింద్, గోపీ, మోహన్ పాల్గొన్నారు.

టెట్‌కు బ్రాహ్మణులకు ఉచిత శిక్షణ

తాటిచెట్లపాలెం : టెట్‌కు హాజరయ్యే బ్రాహ్మణ అభ్యర్థులకు ఉచిత శిక్షణ అందిస్తున్నట్లు వైజాగ్ బ్రాహ్మణ్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు కావూరి చరణ్ కుమార్ తెలిపారు. శిక్షణకు వచ్చే అభ్యర్థులు పదో తరగతి, బీఈడీ, డీఈడీ, ఆధార్ జెరాక్స్ కాపీలు సమర్పించాలని పేర్కొన్నారు. మరిన్ని వివరాలు, రిజిస్ట్రేషన్ కోసం 99625 99790 / 92466 25822 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

వీకెండ్ హంగామా

- వారాంతం కావటంతో రద్దీగా మారిన రోడ్లు
- జగన్నాథుని దర్శనం కోసం కిక్కిరిసిపోయిన టర్నర్ చౌల్ట్రీ


ట్రాఫిక్ రద్దీలో లేపాక్షి జంక్షన్

డాబాగార్డెన్స్ : ఎటు చూసినా ట్రాఫికే. ఏ దారి గుండా వెళ్లాలన్నా ఇబ్బందే. చివరికి గల్లీల్లో కూడా రద్దీ వాతావరణమే. వీకెండ్ కావడంతో విశాఖ దక్షిణ నియోజకవర్గ పరిధిలోని అన్ని ప్రాంతాలు శనివారం రద్దీగా కనిపించాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు బిజీబిజీగా గడిపిన నగర వాసులు వీకెండ్ కావడంతో చల్లని, ఆహ్లాదకర వాతావరణానికి వెళ్లేందుకు ఆసక్తి చూపారు. చల్లదనం కోసం వేలాది మంది ప్రజలు బీచ్‌వైపు పరుగులు తీస్తే.. మరికొందరు సినిమా థియేటర్లకు వెళ్లేందుకు ఉత్సాహం చూపారు. ఇంకొందరు షాపింగ్ మాల్స్ వైపు ఉరుకులు తీశారు. దీంతో ఓ వైపు బీచ్.. మరో వైపు సినిమా థియేటర్లు.. ఇంకోవైపు షాపింగ్ మాల్స్ శనివారం సాయంత్రం కిక్కిరిసాయి. సాయంత్రం 4 నుంచి రాత్రి 9 గంటల వరకు సిటీ పరిధిలో ఏ సెంటర్ చూసినా ఇదే పరిస్థితి తలెత్తింది. ముఖ్యంగా ఆర్టీసీ కాంప్లెక్స్, ద్వారకానగర్, ఆశీల్‌మెట్ట జంక్షన్, ఎల్‌ఐసీ అంబేడ్కర్ కూడలి, డాబాగార్డెన్స్ మెయిన్‌రోడ్డు, సౌత్ జైల్‌రోడ్డు ఇందిరా విగ్రహం కూడలి, సీఎంఆర్ ఏరియా, జగదాంబ జంక్షన్, లీలామహల్ జంక్షన్, పూర్ణామార్కెట్ తదితర జంక్షన్లు, ప్రధాన కూడళ్లు ట్రాఫిక్‌తో నిండాయి. ట్రాఫిక్ పోలీసులు ఎక్కడికక్కడ చర్యలు చేపట్టినప్పటికీ నగరంలో వాహనాల సంఖ్య పెరిగిపోవడంతో రద్దీ నియంత్రణ కష్టంగా మారింది. ట్రాఫిక్ కూడళ్ల వద్ద నిమిషం పాటు రెడ్ సిగ్నల్స్ చూపితే.. క్షణంలోనే వందలాది వాహనాలు నిలిచిపోవడం.. అన్ని వాహనాలను ఒక్కసారిగా పంపలేక పోలీసులు అవస్థలు పడ్డారు.

ఓ వైపు ఆధ్యాత్మికం..

ఇదిలా ఉండగా జగన్నాథుడి దర్శనం కోసం వేలాది మంది భక్తులు తరలి రావడంతో జగదాంబ జంక్షన్ నుంచి పూర్ణామార్కెట్ వరకు.. ఇటు కేజీహెచ్ డౌన్ రోడ్డు.. అటు పోలీస్ కమిషనరేట్ రోడ్డు వాహనాలు.. భక్తులతో నిండిపోయాయి. లేపాక్షి జంక్షన్ నుంచి టర్నర్ చౌల్ట్రీ (పావు కిలోమీటర్ దూరం) వెళ్లాలంటే కనీసం ముప్పావు గంట సమయం పట్టింది. టర్నర్ చౌల్ట్రీ ప్రాంగణం జగన్నాథ నామస్మరణతో మార్మోగింది.

ట్రెజరీలో ప్రక్షాళన

- అంతర్గత బదిలీలు
- ఏటీవో,ఎస్‌టీవో, సీనియర్ అకౌంటెంట్లకు స్థానచలనం

మహారాణిపేట: పలు ఆరోపణలు ఎదుర్కొంటున్న జిల్లా ట్రెజరీ కార్యాలయంలో ప్రక్షాళనకు శ్రీకారం చుట్టారు. వరుస వివాదాలకు కారణమవుతున్న వారిని బదిలీ చేశారు. ఏటీవో, ఎస్‌టీవో, సీనియర్ అకౌంటెంట్లు, జూనియర్ అకౌంటెంట్లను ట్రెజరీలో మరో విభాగానికి బదిలీ చేశారు. డబ్బులు ఇస్తే గానీ బిల్లులు చేయడం లేదని పలుశాఖల అధికారులు నేరుగా ట్రెజరీ శాఖ డైరెక్టర్ మోహన్‌రావుకు ఫిర్యాదు చేశారు. మోహన్‌రావు కూడా ఇటీవల ట్రెజరీ కార్యాలయంలో విచారణ చేశారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న వారిని వివిధ విభాగాలకు బదిలీ చేస్తూ నిర్ణయం తీసుకున్నారు. వైద్య ఆరోగ్యశాఖ బిల్లులు చేస్తున్న ట్రెజరీ ఉద్యోగుల మీద ఆరోపణలు వెల్లువగా వచ్చాయి. ఇప్పుడు ఆ విభాగానికి చెందిన అసిస్టెంటు ట్రెజరీ అధికారి (ఏటీవో) సబ్ ట్రెజరీ అధికారి (ఎస్‌టీవో), ఇద్దరు సీనియర్ అకౌంట్ ఆఫీసర్లను బదిలీ చేస్తూ జిల్లా ట్రెజరీ అధికారి యార్లగడ్డ సుధాకరరావు ఉత్తర్వులు జారీ చేశారు. మెడికల్ బిల్లులు చూసే అసిస్టెంట్ ట్రెజరీ అధికారి నాగార్జునను పోలీసు శాఖకు బదిలీ చేసి, పోలీసు శాఖలో బిల్లులు చూసే నితిన్ జోషిని మెడికల్ బిల్లులకు నియమించారు. గతంలో ఉండే ఇద్దరు సీనియర్ అకౌంటెంట్లను కూడా బదిలీ చేశారు.

ఉద్యోగం, కుటుంబం రెండూ ముఖ్యమే..

- కష్టపడిన సిబ్బందికి గుర్తింపు
- సీపీ డాక్టర్ శంఖబ్రత బాగ్చి


పదోన్నతి పొందిన సిబ్బందితో పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి, జేసీపీ ఫకీరప్ప

అల్లిపురం: పోలీస్ సిబ్బందికి ఉద్యోగం ఎంత ముఖ్యమో.. కుటుంబం కూడా అంతే ముఖ్యమని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి అన్నారు. కమిషనరేట్ పరిధిలో పదోన్నతులు పొందిన 17 సివిల్, ఇద్దరు ఏఆర్ కానిస్టేబుళ్లను శనివారం కమిషనరేట్ సమావేశ మందిరంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ పోలీస్ సిబ్బంది విధి నిర్వహణతో పాటు కుటుంబాన్ని కూడా చూసుకోవాలన్నారు. కానిస్టేబుల్‌కు తన ఉద్యోగ జీవితంలో పదోన్నతి రావడం చాలా అరుదన్నారు. ఐపీఎస్‌లకు ప్రతి మూడేళ్లకు ఓసారి పదోన్నతి రావడం సహజమన్నారు. అదే సంతోషాన్ని కానిస్టేబుళ్లలో ఉండాలని భావించి ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టామన్నారు. పదోన్నతి చెందిన కానిస్టేబుళ్లను వారి కుటుంబ సభ్యుల మధ్య సత్కరించడం ఆనందంగా ఉందన్నారు. తన జీవితంలో ఇటువంటి కార్యక్రమానికి ఎప్పుడూ హాజరుకాలేదన్నారు. అనంతరం పదోన్నతులు పొందిన వారికి సీపీ, జేసీపీ కె.ఫకీరప్ప, ర్యాంకులు, పోస్టింగ్ ఆర్డర్లను అందజేశారు.

గంజాయి రహిత వైజాగ్ లక్ష్యంగా..

గంజాయి రహిత వైజాగ్ లక్ష్యంగా పోలీస్ సిబ్బంది, నగర ప్రజలు, మీడియా కలసికట్టుగా పని చేయాలని సీపీ పిలుపునిచ్చారు. గంజాయి అమ్మేవారిని, సేవించే వారిని నగరం వదిలివెళ్లేలా చేద్దామన్నారు. ఇందు కోసం ఇప్పటికే నగరంలో అవసరమైన చోట సీసీ కెమెరాలు, చీకటి ప్రదేశాల్లో విద్యుత్ దీపాలు ఏర్పాటు చేశామన్నారు. తన ఫోన్ నంబర్‌ను పబ్లిక్‌కు ఇచ్చాని, గంజాయి తాగిన వారు, అమ్మిన వారి సమాచారం వాట్సాప్/ఫోన్ ద్వారా తెలియజేయాలన్నారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. పోలీస్ అధికారులు, సిబ్బంది, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

నేడు జిల్లా యాదవ సంఘం ఆత్మీయ సమావేశం

మద్దిలపాలెం: ఉత్తరాంధ్ర జిల్లాల యాదవ సంఘం ఆత్మీయ సమావేశాన్ని ఆదివారం సిరిపురం వుడా చిల్డ్రన్ ఎరీనాలో నిర్వహించనున్నామని సంఘం జిల్లా అధ్యక్షుడు ఒమ్మి సన్యాసిరావు తెలిపారు. సాయంత్రం 5 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందన్నారు. ముఖ్య అతిథిగా శాసన మండలి ప్రతిపక్షనేత యనమల రామకృష్ణ యాదవ్ హాజరుకానున్నారన్నారు. ఇటీవల గెలుపొందిన ఎమ్మెల్యేలు పల్లా శ్రీనివాసరావు, వంశీకృష్ణ శ్రీనివాస్‌లను సత్కరించనున్నామన్నారు. నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, ఎమ్మెల్సీ నర్సు రామారావు యాదవ్, వీఎంఆర్‌డీఏ మాజీ చైర్‌పర్సన్ అక్కరమాని విజయనిర్మల, మాజీ ఎమ్మెల్యేలు హాజరుకానున్నారన్నారు. జిల్లా యాదవ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ ఉప్పిలి అప్పలకొండ, ఉపాధ్యక్షుడు బొట్టా వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.